

రామచంద్రపురం తహశీల్దార్‌పై ఎస్‌పికి ఫిర్యాదు

ప్రజాశక్తి - రామచంద్రపురం

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన శిరోమండనం కేసులో బాధితులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా జాప్యం చేస్తున్న రామచంద్రపురం తహశీల్దార్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పలువురు దళితులు ఎస్‌పికి సోమవారం ఫిర్యాదు చేశారు. తమకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని హైకోర్టు సైతం ఆదేశించిందన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కోరగా తమను కులం పేరుతో దూషించిన అవమానపరిచారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడారు. 27 ఏళ్లగా ఈ కేసులో ఇప్పటికీ తమకు న్యాయం జరుగలేదన్నారు. అధికారులు కూడా సహకరించుటలేదని విచారం వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసినవారిలో గుబ్బల శ్రీనివాసరావు, రేవు నాగేశ్వరరావు, వెంటపల్లి భీమశంకరం, రామకృష్ణ తదితరులున్నారు.

సర్వే వేగవంతానికి ఆదేశం

ప్రజాశక్తి - అమలాపురం

సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి జెసి ధ్యానచంద్రతో కలిసి ఆయన డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వామిత్వ సర్వే, రీ సర్వే లంక భూములు సర్వే, స్పందన, గ్రీవెన్స్, రబీలో సాగునీటి ఎద్దడి తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తొలి దశ రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో ఎ-క్లాస్, బి-క్లాస్ సరిహద్దు రాళ్ల అమరికకు సంబంధించి రాళ్లు వచ్చాయన్నారు. వీటిని గ్రామ, మండల స్థాయి అధికారులు నేరుగా కూలీల సహకారంతో అమర్చే ఏర్పాట్లు చేపట్టాలన్నారు. రోవర్ బృందాలు తొలుతగా పాయింట్లు గుర్తించి ఫైనల్ మ్యాప్ ప్రకారం సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో డకటాలోగ్ ప్రక్రియను పూర్తి చేస్తూ రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణ గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వాలుయేషన్, 13 నోటిఫికేషన్ డ్రాఫ్ట్ ఆర్ఓఆర్, ఫైనల్ ఆర్ఓఆర్ భూ యజమాని పేరు హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాలు సమాంతరంగా చేపట్టాలన్నారు. లంక భూములు సర్వేను పారదర్శకంగా చేపట్టి భూమిలేని పేదలకు, ఇప్పటికే ఆయా భూములు అనుభవిస్తున్న వారికి ఐదేళ్ల లీజు ప్రాతిపదికన అప్పగించాలన్నారు. స్పందన అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తహశీల్దార్, ఎంపిడిఒ, వ్యవసాయ, జలవనరుల శాఖ, పోలీసు, వైద్య, ఆరోగ్య, డ్రైనేజీ శాఖల అధికారులు బృందాలుగా ప్రతి సోమవారం గ్రామ, మండల స్థాయిలో స్పందనను నిర్వహించాలన్నారు. తద్వారా జిల్లా స్థాయిలో స్పందన కార్యక్రమానికి తాకిడి తగ్గుతుందన్నారు. జిల్లాలో సాగునీటి ఎద్దడి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే చాలా వరకు క్రాస్ బండ్లు ఏర్పాటు చేసి డ్రెయిన్లలో నీటిని మోటార్ల ద్వారా పంట పొలాలకు సరఫరా చేస్తున్నామన్నారు. సీలేరు నుంచి గోదావరిలోకి నీటిని విడుదల చేస్తున్నారని, తద్వారా సాగునీటి ఎద్దడి సమస్యలు పూర్తిగా తొలగి పోతాయన్నారు. ఈ-క్రాప్ బుకింగ్, ఫార్మర్ ఇకెవైసి ప్రక్రియలు త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. అలాగే ఉగాది నాటికి నిర్దేశించిన లక్ష్యాలను గృహ నిర్మాణ సంస్థ ఇంజినీర్లు చేరుకోవాలన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమానికి సంబంధించి ఆరోగ్య కార్డులు, ఐకెవైసి ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథకం ద్వారా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించి ఆహార యూనిట్లకు సంబంధించిన ఖాదీ పరిశ్రమలు జిల్లాలో ఎక్కువగా స్థాపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఒ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ సిహెచ్‌ఎన్‌వి.కృష్ణారెడ్డి, గృహ నిర్మాణ సంస్థ పీడీ ఎం.బాబూరావు, చేనేత జౌళి శాఖ ఎడి రాజు, డిసిహెచ్ ఎస్.పద్మశ్రీరాణి, జిల్లా వ్యవసాయ అధికారి కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జెసి తదితరులు

వైసిపి ఎంఎల్‌సి అభ్యర్థుల ఖరారు

- స్థానిక సంస్థల కోటా నుంచి కుడుపూడి సూర్యనారాయణ
- గవర్నర్ కోటాలో కాకినాడకు చెందిన కర్రి పద్మశ్రీ
- ఎంఎల్‌ఎ కోటా నుంచి బొమ్మి ఇజ్రాయిల్ ఎంపిక

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

స్థానిక సంస్థలు, ఎంఎల్‌ఎ, గవర్నర్ కోటాలో ఎంఎల్‌సి అభ్యర్థుల పేర్లను అధికార వైసిపి సోమవారం ప్రకటించింది. మొత్తం 18 ఎంఎల్‌సి స్థానాల్లో అభ్యర్థుల పేర్లను ప్రకటించగా వీరిలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి ముగ్గురికి అవకాశం దక్కింది. స్థానిక సంస్థల కోటా నుంచి బిసి సామాజిక వర్గానికి చెందిన అమలాపురం పట్టణం సూర్యనగర్‌లో నివాసముంటున్న కుడుపూడి సూర్యనారాయణరావును అభ్యర్థిగా ఖరారు చేశారు. వీరిది ఎంఎ, బిఎల్ చదివిన [illegible] విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీలో విద్యార్థి సంఘం నాయకుడుగా పనిచేశారు. అమలాపురం కోర్టులో న్యాయవాదిగా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా సేవలందించారు. ఆయన తండ్రి గోపాలకృష్ణ గోఖలే పోలీసు ఉన్నతాధికారిగా సేవలు అందించారు. భార్య డాక్టర్ విజయ వైద్య శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ఆయన ప్రస్తుతం ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహాసభ కన్వీనర్‌గా ఉన్నారు. టిడిపి హయాంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా పనిచేశారు. గతంలో బిఎస్‌పి, ప్రజారాజ్యం పార్టీల తరుపున అమలాపురం స్థానం నుంచి ఎంపి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు.కొంతకాలం బిజెపిలో పని చేసి అనంతరం వైసిపిలో చేరారు. గవర్నర్ కోటాలో రాష్ట్రంలో ఇద్దరికి అవకాశం దక్కింది. వీరిలో కాకినాడ జగన్నాయకపూర్ ప్రాంతానికి చెందిన కర్రి పద్మశ్రీ ఉన్నారు. మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన ఆమె ఇటీవలే వైసిపిలో చేరారు. ఆమె భర్త కర్రి నారాయణరావు వైసిపి రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఉన్నత విద్యను అభ్యసించిన ఆమె జాతీయ మత్స్యకార మహిళా అధ్యక్షురాలుగా, అలాగే రాష్ట్ర మత్స్యకార సంక్షేమ సమితి మహిళా అధ్యక్షురాలిగా పని చేస్తున్నారు. ఎంఎల్‌ఎ కోటా నుంచి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడి గ్రామానికి చెందిన బొమ్మి ఇజ్రాయిల్ పేరును ఖరారు చేశారు. ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన ఆయన గతంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకునిగా పని చేశారు. 2020లో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో గోడి గ్రామం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. ఎన్నికలు లేకుండా పదవి పొందే అవకాశం రావడంతో ఎంఎల్‌సి పదవుల కోసం అనేకమంది పోటీపడి భంగపడ్డారు. ఈ ఏడాది ఎంపికైనా ఎన్నికైతే 2029 వరకు వారు ఆ పదవిలో కొనసాగే అవకాశముంది. 2024 ఎన్నికల్లో పార్టీ గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా ఆరేళ్లపాటు ఎంఎల్‌సి పదవిలో కొనసాగవచ్చు. ఈ నేపథ్యంలోనే పలువురు సీనియర్ నేతలు వీటి కోసం పోటీ పడి నిరాశ చెందారు.



కర్రి పద్మశ్రీ



కుడుపూడి సూర్యనారాయణరావు



బొమ్మి ఇజ్రాయిల్



వినతిపత్రం ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన పంచాయతీ కార్మికులు

బకాయి జీతాలు చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి - అమలాపురం

పంచాయతీ కార్మికులకు 13 నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం స్పందనలో కలెక్టర్ హిమాన్షుశుక్లాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు నిమ్మకాయల వెంకటేష్ మాట్లాడారు. గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు 2021లో ఏడు నెలలు, 2022లో ఆరు నెలల వేతనాలు మొత్తంగా 13 నెలల వేతనాలు చెల్లించాల్సి ఉందన్నారు. వేతనాలు ఇవ్వకపోతే కార్మికులు ఏం తిని పనిచేస్తారని డిఎస్‌పిఒను నిలదీశారు. ఈ సందర్భంగా డిఎల్‌పిఒ మాట్లాడుతూ 2021లో ఏడు నెలలు ఇవ్వాల్సింది వాస్తవమేనని దాని సంబంధించి కేంద్ర ప్రభుత్వం బకాయిలు విడుదల చేయాల్సి ఉందన్నారు. 2022 సంబంధించి వెంటనే బకాయి జీతాలు చెల్లిస్తామని ముందుగా రెండు నెలకు జీతాలు ఇస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు 6 నెలలు నుంచి 13 నెలలు జీతాలు బకాయిలు ఉన్నాయని జిల్లా అంతట కూడా జీతాలు చెల్లించాలని నిమ్మకాయల వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జగడం నాగేశ్వరరావు, పండు నాగభూషణం, వి.సాక్షి, పి.శ్రీరాములు, జగడం సత్యనారాయణ, రాజేష్ పాల్గొన్నారు.

తాతపూడి ఎత్తిపోతల పథకం ప్రారంభం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలంలోని తాతపూడి ఎత్తి పోతల పథకం సోమవారం ప్రారంభమైంది. కోవిడ్ సమయంలో లాక్‌డౌన్ కారణంగా పర్యవేక్షణ లేకపోవడంతో పంపులు, మూడు మోటార్లు పాడయ్యాయి. ప్రస్తుతం రబీ సీజన్లో సాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు వీటిని మరమ్మతులు చేయించారు. జిల్లా మినరల్ ఫౌండేషన్ నిధులు నుంచి రూ.9లక్షలను కలెక్టర్ కేటాయించారు. ఈ ఎత్తిపోతల పథకంలో 125 అశ్వ సామర్థ్యం గల నిలువు టర్బైన్ పంపులు ఏడు ఉన్నాయన్నారు. ఒక్కొక్క పంపు 16.50 క్యూ సెక్కుల నీటిని పంపింగ్ చేసే సామర్థ్యం కలిగి ఉందన్నారు. గౌతమి నది నుంచి నీటిని ఎత్తిపోస్తుందన్నారు. దీని వల్ల మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఆలమూరు, కపిలేశ్వరపురం, కె.గంగవరం, తాళ్లరేవు ,మండలాల పరిధిలోని సుమారు 6 వేల ఎకరాల ఆయకట్టుకు అదనపు సాగునీరు సరఫరా అవుతుందన్నారు. ఎస్ఇ జి.శ్రీనివాసరావు, డిఇ కెవి. సుబ్బారావు, ఎఇ విశ్వనాథరాజు ఆధ్వర్యంలో వీటిని ప్రారంభించారు.



ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఇ

ఎంఎల్‌ఎను దూషించిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి- ఐ.పోలవరం

ముమ్మిడివరం ఎంఎల్‌ఎ పొన్నాడ వెంకటసతీష్‌కుమార్‌పై సోషల్ మీడియా ద్వారా అనుచిత వ్యాఖ్యలు చేసిన చీకురుమిల్లి రవికుమార్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని ఎంపిపి మోర్త రాణి ఆధ్వర్యంలో నాయకులు ఎస్ఐ సిహెచ్.రాజేష్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. సామాజిక వర్గాల మధ్య చిచ్చు రేపే విధంగా అసభ్య పదజాలంతో ఎంఎల్‌ఎను దూషించి వ్యక్తి, సోషల్ మీడియాలో వీడియోలు పోస్టు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపిపి వెంట మిరియం జ్యోతి, ఢిల్లీ నారాయణ, మోకా రవి, సఖిలే వెంకటేశ్వరరావు, మోర్త చిన్న, మట్టా గగన వీరుడు, రేవు సత్యనారాయణ, కె.నాగేశ్వరరావు, బీర మాధవ తదితరులున్నారు

నిర్మలకుమారి మృతి తీరని లోటు

ఆలమూరు : వైసిపి సీనియర్ నేత కొల్లి నిర్మలాకుమారి మరణం పార్టీకి తీరని లోటని, ఆమె కుటుంబానికి వైసిపి అండగా నిలుస్తుందని ఎంఎల్‌ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సోమవారం ఆలమూరులో జరిగిన నిర్మలా కుమారి సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి మాట్లాడారు. నిర్మలకుమారి వైసిపికి ఎనలేని సేవలు అందించారన్నారు. ఆమె కుమారుడు, కుమార్తెలను ఓదార్చి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, వైసిపి మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, ప్రముఖ పారిశ్రామిక వేత్త వంటిపల్లి పాపారావు, నేతలు తోరాటి రాంబాబు, యనమదల నాగేశ్వరరావు, నాతి కుమార్ రాజా, నెక్కంటి బుజ్జి, రావాడ సత్తిబాబు, విజయం తదితరుల పాల్గొన్నారు.

ఉత్సవాల జయప్రదంపై హర్షం

రాజోలు : వీరభద్ర స్వామి, అయ్యప్ప స్వామి వార్ల 37వ ఏకాహ మహోత్సవంతో పాటు మహా శివరాత్రిని విజయవంతం చేసిన సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఉత్సవ కమిటీలో కీలక పాత్ర పోషించిన యెుండూరి నమ్మశివాయను సత్కరించారు. అలాగే పలువురు కళాకారులు, రాజోలు ప్రాంత పరిరక్షణ కోసం సేవలందించిన వారిని మెమెంటోలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్, కె.రాజు, దార్ల పెదబాబు, దార్ల బాపూజీ, మావూరి నాగ బాబు, ఎన్.సాయి, సిహెచ్.రాంబాబు, కె.చిన్నారి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు గడువులోగా పరిష్కారం

ప్రజాశక్తి - అమలాపురం

స్పందనలో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా విచారించి, నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా, జెసి ధ్యానచంద్ర, డిఆర్ఒ సిహెచ్.సత్తిబాబులతో కలిసి అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పౌర సరఫరా సేవలు, నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకం, కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, సామాజిక భద్రతా పింఛన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు తదితరాలకు సంబంధించి సుమారుగా 170 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ స్పందన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ఒకసారి వచ్చిన అర్జీ రీ ఓపెన్‌కాకుండా సమస్యను పరిష్కరించాలని సూచించారు. పరిష్కార నివేదికలో అందిన అర్జీ దారుని సమస్య పరిష్కారానికి సంబంధించిన ఫోటోలను తప్పనిసరిగా స్పందన యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఒ వెంకటేశ్వర్లు, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ టి.వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఎస్ఇలు కృష్ణారెడ్డి, చంటిబాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.నాగేశ్వరరావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎన్.మల్లికార్జునరావు, డిపిఒ వి.కృష్ణకుమారి, డిఎస్ఓ ఎ.పాపారావు, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, పశుసంవర్ధక శాఖ జెడి జైపాల్ తదితరులు పాల్గొన్నారు.



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : రఘురాం

ప్రజాశక్తి - రామచంద్రపురం

కొత్తగా నియమితులైన గృహసారథులు, వాలంటీర్లు కలిసికట్టుగా పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని వైసిపి పరిశీలకులు ఒమ్మి రఘురాం అన్నారు. సోమవారం ద్రాక్షారంలో ఏర్పాటు చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధమవ్వాలన్నారు. వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్న 'జగనే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా వాలంటీర్ వ్యవస్థను నిలిపివేసిన పక్షంలో గృహసారథులు పూర్తి బాధ్యతగా ఇంటింటికీ వెళ్లి పార్టీని మరింత పటిష్ఠం చేయాలని వివరించారు. మంత్రి వేణు మాట్లాడుతూ వాలంటీర్లు ఐక్యతతో పనిచేయాలన్నారు. తనకు ఇక్కడ మళ్ళీ సీటు రావడం ఖాయమని ఈ మేరకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబటి భవాని, జడ్‌పిటిసి సభ్యులు వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, సర్పంచ్‌లు యల్లమిల్లి సతీష్‌కుమారి, కొత్తపల్లి అరుణ, పిల్లి రాంబాబు, అనిశెట్టి రామకృష్ణ, కె.గోవిందు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తైక్వాండోలో తూర్పులంక విద్యారుల ప్రతిభ

ప్రజాశక్తి- అమలాపురం(అల్లవర

జిల్లా స్థాయి 28వ ఇంటర్ క్లబ్ తైక్వాండో ఛాంపియన్ షిప్-2023 పోటీల్లో అల్లవరం మండలం తూర్పులంకకు చెందిన మచ్చా షణ్ముఖ సాయిశ్రీకర్ ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్, మచ్చా సాయి శరణ్య తతీయ స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ సాధించారని తైక్వాండో అసోసియేషన్ జిల్లా సెక్రటరీ బి.అర్జున్‌రావు, జిల్లా సీనియర్ కోచ్ పెచ్చెట్టి త్రిమూర్తులు సోమవారం తెలిపారు. ఈ పోటీలను న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడ స్టేడియంలో ఆదివారం నిర్వహించారు. విజేతలను ఎంపిపి ఇళ్ల శేషగిరిరావు, జడ్‌పిటిసి సభ్యులు కె.గౌతమీమహేష్, తూర్పులంక సర్పంచ్ కడలి గంగాచలం, గ్రామస్తులు అభినందించారు.

స్వాగత బోర్డులకు మూత

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - అంబాజీపేట

ఎంఎల్‌ఎ, సిఎం ఫొటోలతో ఉన్న స్వాగత బోర్డులను క్లాత్‌లతో మూతవేశారు. ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ ఉల్లంఘన పేర ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన వార్తకు ఎంపిడిఒ ఐ.రత్నంరాజు స్పందించారు. మండలంలో నాయకుల ఫొటోలతో ఉన్న స్వాగత బోర్డులను క్లాత్‌లతో మూయించివేశారు.



కళాశాల విద్యార్థుల శ్రమదానం

కొత్తపేట : ప్లాస్టిక్‌ను నిరోధించండి, ఆరోగ్యాన్ని కాపాడుకోండి అనే నినాదాలతో కొత్తపేట విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం శ్రమదానం చేశారు. కళాశాల పరిసరాలను శుభ్రం చేసి వ్యర్థ పదార్థాలను తొలగించారు. కళాశాలలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డిసిహెచ్.పాపారావు, కె.సత్యనారాయణ, కనకరాజు, రమాదేవి విద్యార్థులు పాల్గొన్నారు.

కాజ్‌వే పనుల పరిశీలన

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి ఉచ్చులవారిపేట సమీపంలో పాటు రేవుపై ఉన్న కాజ్ వే పునర్నిర్మాణ పనులను ఎంఎల్‌ఎ కొండేటి చిట్టిబాబు సోమవారం పరిశీలించారు. లంక గ్రామాలైన అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నం లంక వాసులు మండల కేంద్రమైన మామిడికుదురు వెళ్లేందుకు ఇదే దగ్గర మార్గం. దీంతో నిత్యం రద్దీగా ఉంటుంది. పాటు రేవు వరకూ సిసి రోడ్డు ఉండటం ఇటీవల వరదల్లో కాజ్ వే కుంగిపోయింది. కలెక్టర్ వరద సమయంలో కాజ్ వే దుస్థితి పరిశీలించి నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కె.హిమవంతరావు, వాసంశెట్టి చినబాబు, గెడ్డం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎఐసిసి కో-ఆప్షన్ సభ్యునిగా 'చీకట్ల'

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఎఐసిసి కో-ఆప్షన్ సభ్యునిగా చీకట్లపాలేనికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చీకట్ల అబ్బాయి నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాలు ఆయనకు సోమవారం అందాయి. తన నియామకానికి కృషి చేసిన ఎపిసిసి ఛీఫ్ గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, ఇన్‌ఛార్జి సుంకర పద్మశ్రీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అబ్బాయి నియామకం పట్ల అమలాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి అయితాబత్తుల సుభాషిణి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోలిశెట్టి హరిబాబు, నాయకులు గెడ్డం సురేష్‌బాబు, ఎన్.నాగేంద్రప్రసాద్, ఆకుల వెంకటరెడ్డినాయుడు, డి.జయ, డి.విజయలక్ష్మి, ఎ.కుమార్‌సింగ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

సాత్విన్ ఆపరేషన్‌కు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేటకు చెందిన ఈతకోట సాత్విన్(6) కాళ్ల ఆపరేషన్‌కు ముంజవరం జెవిఎ చర్చి పాస్టర్ ఎల్.జోసెఫ్ సోమవారం రూ.22 వేల ఆర్థిక సాయం అందించారు. అనంతరం ఆపరేషన్ విజయవంతం కావాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెవిఎ చర్చి సంఘం పెద్దలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వృక్ష సంపదను దోచుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడ పరిధిలో 216ఎ నేషనల్ హైవే స్థలంలో వృక్ష సంపదను దోచుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఇక్కడ ఎంతో వృక్ష సంపద ఉండేదన్నారు. కొంత మంది వాటిని నరికేసి అమ్ముకుని సొమ్ము చేసుకోవడం చాలా బాధాకరమన్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి దీనికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో నిరాహార దీక్షలు చేపడతామని వారు హెచ్చరించారు. ఇప్పటికైనా జాతీయ రహదారి అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ తాడి శ్రీనివాసరెడ్డి, తమలంపూడి కృష్ణారెడ్డి, తాడి వెంకటరెడ్డి, గొడవర్తి దుర్గాప్రసాద్, కొవ్వూరి సీతారామరెడ్డి, వి.గోపి, సిహెచ్.ప్రేమ్‌కుమార్, భావన శివ, గంటా మనోహర్ దాస్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో 50 మంది చేరిక

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని వేగాయమ్మపేటలో టిడిపి ఇన్‌ఛార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం సమక్షంలో 50 మంది సోమవారం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ టిడిపికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక గన్నవరంలో రౌడీ మూకలు పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేశారన్నారు. ఇది అత్యంత హేయమైన చర్య అన్నారు. ప్రజాస్వామ్యవాదులందరూ దీనిని ఖండించాలని కోరారు. రాష్ట్రం బాగుపడాలంటే టిడిపిని అధికారంలోకిఒ తీసుకురావాలన్నారు. వనుము వీరభద్రరావు ఆధ్వర్యంలో పార్టీతీర్థం పుచ్చుకున్న 50 మందికి ఆయన కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మేడిశెట్టి రవి, కొత్తపల్లి శ్రీనివాసరావు, మురార్జీ రాయుడు, లీలా శంకర్, పి.బాబ్జి, గంగాధరం, బొమ్మ రాంబాబు, బాలకృష్ణ, టి.వెంకన్న, సిహెచ్.అర్జున్, వి.చంటి, జి.వినోద్, కె.రాఘవన్ తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'




ఛార్జీల పెంపు... మన బాధ్యత కద్సార్..!!!

సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలి

రాష్ట్ర పరిశీలకులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - యంత్రాంగం

రైతులు సామూహిక ఎలుకల నివారణను చేపట్టాలని వ్యవసాయ శాఖ రాష్ట్ర పరిశీలకులు డి.వెంకటేశ్వర్లు తెలిపారు. **రామచంద్రపురం** నియోజకవర్గం కె.గంగవరం మండలంలోని దంగేరులో ఏర్పాటు చేసిన ఎలుకల మందు పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో 863 కేజీల ఎలుకల నివారణా మందును ఉచితంగా అందిస్తున్నామన్నారు. అలాగే ఆర్‌బికె వద్ద ప్రతి శుక్రవారం సమావేశాల నిర్వహణపై ఆరా తీశారు. ఎలుకల మందు ఎలా ఉపయోగించాలనేదానిపై ఎఒ బి.రవి వివరించారు. రైతులకు స్ప్రేయర్లు, టార్పాలిన్‌లు పంపిణీ చేయాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఇళ్ల సూర్య నారాయణ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచ్ కొప్పిసెట్టి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ అగ్రికల్చర్ జ్యోతిర్మయి. ఎడిఎ జయరామలక్ష్మి. రైతులు పాల్గొన్నారు. అనంతరం ఎలుక నివారణ ర్యాలీ నిర్వహించారు. స్వయంగా పంటచేలో ఎలుకల మందు వినియోగాన్ని పరిశీలించారు. **ఆలమూరు** మండలం గుమ్మిలేరు ఆర్‌బికె వద్ద సర్పంచ్ రాంబాబు అధ్యక్షతన ఎలుకల నివారణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎఒ లక్ష్మీలావణ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు వై.రమేష్‌చౌదరి, అగ్రికల్చర్ అసిస్టెంట్ పద్వీ పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** టేకి ఆర్‌బికె వద్ద ఎలుకల నివారణా మందు పంపిణీని అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ డి.వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఆయనతోపాటు ఎటిఎంఎ పీడీ జ్యోతిర్మయ, డిఆర్‌సి ఎఒ మనోహర్ ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల చైర్మన్ పుట్ట కృష్ణబాబు, ఎఒ రమేష్‌కుమార్, అగ్రికల్చర్ సహాయకులు జి.హరిబాబు తదితరులు పాల్గొన్నారు. **అంబాజీపేట** మండలం ఇరుసుమండలో నిర్వహించిన ఎలుకల నివారణ మందు పంపిణీలో ఎఒ సిహెచ్‌డి.విజయ్ కుమార్ పాల్గొన్నారు. సామూహిక ఎలుకల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు విఆర్ఒ కె.కృష్ణమూర్తి, ఎఇఒ దుర్గారావు, విఎఎ ఎన్.దుర్గ తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు** సచివాలయం నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయాధికారి బి.మృదుల పాల్గొన్నారు. ఎలుకల నివారణ మందును రైతులకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు కంచి సత్యనారాయణ, కుసుమ బాలకృష్ణ, కూన రామకృష్ణ, రామేశ్వరరావు, వెంకట నారాయణ, విఎఎ పి.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు



ఎలుకల మందును పంపిణీ చేస్తున్న వెంకటేశ్వర్లు

'బొమ్మి'కి ఎంఎల్‌సి కేటాయింపుపై హర్షం

ప్రజాశక్తి - మండపేట, అమలాపురం రూరల్

మాదిగ సామాజిక వర్గానికి చెందిన బొమ్మి ఇజ్రాయేల్‌కు ఎంఎల్‌ఎ కోటాలో ఎంఎల్‌సి పదవిని కేటాయించడంపై వైసిపి నియోజకవర్గ దళిత నాయకులు పలివెల సుధాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తి అయిన ఇంత వరకు ఏ రాజకీయ పార్టీ కూడా మాదిగలను గుర్తించలేదన్నారు. గతంలో మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు మాదిగలకు కోనసీమలో ఎంఎల్‌ఎ టికెట్ ఇస్తానని బహిరంగ ప్రకటన చేసి చివరకు ఇవ్వకుండా మోసం చేశారన్నారు. బొమ్మికి ఎంఎల్‌సి కేటాయింపునకు కృషి చేసిన ఎంపీ, మంత్రులు, ఎంఎల్‌ఎలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బొమ్మి ఇజ్రాయిల్‌కి ఎంఎల్‌సి కేటాయించడం పట్ల ఎంఎస్‌పి అమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి లూటుకుర్తి చిన్న సోమవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఎంఎల్‌సి పదవి కేటాయించడంలో సహకరించిన ఎంపీ, మంత్రులు, ఎంఎల్‌ఎలకు కృతజ్ఞతలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

గుర్తుతెలియని వాహనం ఢీకొని లారీ క్లీనర్ మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి మండలం మురారి గ్రామ శివారుణ న్యూ అన్నపూర్ణ హోటల్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని లారీ క్లీనర్ మృతిచెందినట్లు గండేపల్లి ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపారు. సోమవారం తెల్లవారు జాము సుమారు రెండు గంటల సమయంలో కోడిగుడ్ల లోడుతో జంగారెడ్డి గూడెం నుండి కలకత్తా వెళుతున్న లారీ ఆగి, లారీ క్లీనర్ మాదాసు దుర్గా ప్రసాద్ (32) మురారి న్యూ అన్నపూర్ణ హోటల్ ఎదురుగా గల పాన్‌షాప్ వద్దకు వెళ్లేందుకు రోడ్ దాటుతుండగా జగ్గంపేట వైపు నుండి రాజమండ్రి వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడిక అక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ గణేష్ కుమార్ తెలిపారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. శవపంచనామా జరిపి మృతదేహాన్ని అతని బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. తణుకు పట్టణానికి చెందిన దుర్గా ప్రసాద్ బావమరిది ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్ఐ గణేష్ కుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మోటార్ సైకిల్ దొంగ అరెస్టు
28 వాహనాల స్వాధీనం

ప్రజాశక్తి - కాకినాడ క్రైమ్

మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ఒక దొంగను అరెస్ట్ చేసి రూ.15 లక్షల విలువైన 45 మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం వాడపల్లి గ్రామానికి చెందిన కోరాడ వెంకటేశులు పాత నేరస్తుడే గత కొంతకాలంగా ఇతను మోటార్ సైకిల్ దొంగతనాలు పాల్పడుతున్నాడు. వెంకటేశులు చెడు అల వాట్లకు బానిసై సులభంగా డబ్బులు సంపాదించాలని ఆశతో కాకినాడ, మండపేట, కడియం, రాజమహేంద్రవరం, తణుకు, ఏలూరు తదితర ప్రాంతాల పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడ్డాడు. ఈ వివరాలను ఎఎస్పి పి.శ్రీనివాస్ మీడియా వివరించారు.

నలుగురి రిపోర్టర్లపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు

ప్రజాశక్తి-గోపాలపురం

నలుగురు ఎలెక్ట్రానిక్ మీడియా రిపోర్టర్లపై గోపాలపురం పోలీస్ స్టేషన్లో ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. మండలంలోని వాదాలకుంట గ్రామానికి చెందిన పాముల నాగేంద్రబాబు హెచ్ఎం టివి ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్‌గా పని చేస్తున్నారు. ఇతర ఛానల్లో పని చేస్తున్న సున్నం శ్రీహరి, పథ్వి, ప్రసన్నకుమార్, ఉప్పునపల్లి ప్రసాద్ నాగేంద్రబాబు గురించి తన ఛానల్ యజమాన్యానికి చెడుగా చెప్పారని మనస్తాపానికి గురయ్యాడు. ఇంటి దగ్గర నుంచి వెళ్లిపోయి గోదావరిలో దూకగా దగ్గర్లోని జాలర్లు రక్షించి కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. దీంతో బాధితుడు నాగేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

తల్లి మందలించిందని యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి-తాళ్లపూడి

సెల్ ఫోన్ చూడవద్దని తల్లి మందలించిన కారణంగా యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తాళ్లపూడి మండలంలో జరిగింది. తాళ్లపూడి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తాడిపూడి గ్రామానికి చెందిన ముక్కవరపు సాయి అఖిల (20) తరచూ సెల్ చూస్తున్న కారణంగా తల్లి వెంకటరమణ మందలించింది. దీంతో ఆదివారం సాయంత్రం యువతి గుళికలు మింగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను 108 వాహనంలో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆసుపత్రి సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాళ్లపూడి ఎఎస్ఐ డివి.ప్రసాద్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారని ఎస్ఐ కెవి.రమణ తెలిపారు.

ఇసుక లారీ సీజ్

ప్రజాశక్తి-తాళ్లపూడి

ఎటువంటి బిల్లులు లేకుండా 18 టన్నుల ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న లారీని సీజ్ చేసినట్లు తాళ్లపూడి ఎస్ఐ కెవి.రమణ తెలిపారు. జెపి కంపెనీ ఉద్యోగి డి.ఆనంద్ సోమవారం మండలంలోని గజ్జరం గ్రామం వద్ద జరిపిన తనిఖీల్లో పాత బిల్లుతో ఇసుకను రవాణా చేస్తున్నట్లు గుర్తించి ఫిర్యాదు చేశారన్నారు. దీంతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - సీతానగరం

రోడ్డు పనుల నిమిత్తం రాజంపేట నుంచి బొబ్బిల్లంకకు కాంక్రీటు లోడుతో వెళుతున్న లారీ సోమవారం ప్రమాదానికి గురయ్యింది. రాజంపేట రోడ్డు ప్రక్కన ప్లాంట్ నుంచి బయల్దేరిన కాంక్రీటు లారీ మునికూడలిలో రోడ్డు గతుకుల్లో పడి ముందున్న కుడివైపు చక్రం ఊడిపోయింది. దీంతో భారీ ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. భారీ వాహనాలు పరిస్థితే ఇలా ఉంటే చిన్న వాహనాలపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు.

ఆర్‌డిఒ స్పందనలో 15 దరఖాస్తులు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ఆర్‌డిఒ జె సీతారామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని పలు గ్రామాల నుండి సమస్యల పరిష్కారం కోరుతూ 15 దరఖాస్తులు అందజేశారు. ఈ దరఖాస్తులపై ఆర్డీవో సీతారామారావు మాట్లాడుతూ ఈ దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించి అర్జీదారులకు తెలియజే యాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. s

ఆలయానికి ఊయల అందజేత

ప్రజాశక్తి-కడియం

ప్రసిద్ధిగాంచిన కడియం శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయానికి బిజెపి నేత ఆకుల శ్రీధర్ రూ.30 వేల విలువైన ఊయల అందించారు. ధర్మకర్తల మండల చైర్మన్ రావిపాటి సత్యనారాయణ మూర్తి, ప్రధాన అర్చకులు అప్పలి శ్రీమన్నారాయణ, ఆలయ ఇఒ వివి.శ్రీనివాస్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, గెడ్డం శివ, వేదాంతం చక్రపాణి, చిక్కాల ఈశ్వరరావు, అధికారి నరసింహారావు, వట్టికూటి మధు, గారపాటి తాతబ్బాయి, బోణం గంగాధర రామారావు, తాడాల వెంకటేష్, పాల్గొన్నారు.

రాజు మృతిపై విచారణ జరిపించండి

- వర్క్ మెన్ కాంపన్సేషన్ యాక్ట్ అమలు చేయాలని సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక వాలుతిమ్మాపురం రహదారిలోని పట్టాభి ఆగ్రో పరిశ్రమలో డ్యూటీలో ఉండగా మరణించిన కార్మికుడు రాజు మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని సిఐటియు డిమాండ్ చేసింది. సోమవారం సిఐటియు పెద్దాపురం మండల అధ్యక్ష, కార్యదర్శులు గడిగట్ల సత్తిబాబు, దారపు రెడ్డి క్రాంతి కుమార్ లు మాట్లాడుతూ రాజు మృతిపై యాజ మాన్యం వింత వాదనలు చేస్తోందన్నారు. కార్మికుని కనీసం కంపెనీ నుండి పీఎఫ్, ఈఎస్ఐ కల్పలేదన్నారు. వర్క్ మెన్ కాంపెన్సేషన్ యాక్ట్‌లో ఫ్యాక్టరీ ఇన్స్పెక్టర్ కేసు నమోదుచేసి పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. నిత్యం ప్రమాదాలకు కారణ మవుతున్న కంపెనీలపై అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. జీరాగంపేటలో కార్మికులు మృతి చెందిన ఘటన మరువకముందే పట్టాభి ఆగ్రో పరిశ్రమలో కార్మికుడు మృతిచెందడం కార్మిక వర్గానికి ఆందోళన కలిగిస్తోందన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ వర్క్ మెన్ కాంపెన్సేషన్ యాక్ట్ ప్రకారం మృతుడు గోరిశెట్టి రాజు కుటుంబానికి న్యాయం జరగాలని విజ్ఞప్తి చేశారు. సంఘటనపై పరిశ్రమ యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఆదిత్యలో అపోలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం నేతృత్వంలో అపోలో సన్ షైన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రిన్సిపాల్ డోలా సంజయ్ ప్రారంభించారు. వైద్య శిబిరంలో విద్యార్థులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. పలు రకాలైన ఆరోగ్య సమ స్యలపై విద్యార్థులకు అవగాహనకల్పించి, రానున్న వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సుమారు 100 మంది విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ పిఒ, వాలంటీర్లు పాల్గొన్నారు

పోరాడి ఓడిన ఆంధ్ర జట్టు

- లీగ్ దశలోనే ఇంటి ముఖం
- ఉత్తరాఖండ్ పై పంజాబ్ విజయం
- కొనసాగుతున్న హాకీ పోటీలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఉత్తరప్రదేశ్ పై చివరి వరకు పోరాడి ఒక గోల్ తేడాతో క్వార్టర్స్ చేరకుండానే ఆంధ్ర టీమ్ ఇంటి ముఖం పట్టింది. కాకినాడ జిల్లా ప్రాధికార సంస్థ మైదానంలో 13వ ఇండియా సీనియర్ మహిళా జాతీయ ఛాంపియన్షిప్ పోటీలు సోమవారం కూడా కొనసాగాయి. పంజాబ్ - ఉత్తరాఖండ్ జట్ల మధ్య పోరు ఆసక్తి కలిగించింది. పంజాబ్ జట్టు ఉత్తరాఖండ్ జట్టుపై రెండు గోల్స్ సాధించి గెలుపు దక్కించుకుంది. చివర వరకు పోరాట పటిమ ప్రదర్శిం చిన ఉత్తరాఖండ్ ఒక గోల్ కూడా సాధించ కుండానే పంజాబ్ చేతుల్లో చిత్తుగా ఓడిపోయింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా పంజాబ్ జట్టు సరదీప్ కౌర్ ఎంపికయింది. ఉత్తర ప్రదేశ్‌పై ఆంధ్రప్రదేశ్ జట్టు చివరి వరకు పోరాడి ఇంటి ముఖం పట్టింది. మొదటి అర్ధభాగంలోనే రెండు గోల్స్ సాధించి ఉత్తరప్రదేశ్ పై ఆంధ్ర జట్టు పట్టు సాధించిన తరువాత ఉత్తరప్రదేశ్ ఏకధాటిగా రెండు గోల్స్ చేసి స్కోరును సమానం చేసింది. అయితే ఉత్తరప్రదేశ్ ఇచ్చిన రెండు పెనాల్టీ కార్నర్లను సద్వినియోగం చేసుకోవడంలో ఆంధ్ర టీం విఫలమయింది. మ్యాచ్ ముగిసేందుకు ఒక నిమిషం సమయం ఉందన్న సమయంలో గోల్ కీపర్ ఇచ్చిన స్ట్రోక్‌ను పెనాల్టీ కార్నర్‌గా మలుచుకున్న ఉత్తర ప్రదేశ్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచుకుని 3-2 ఆధిక్యత సాధించింది. చివరి అర్ధ నిమిషంలో గోల్ వేసి ఆధిక్యత సంపాదించుకున్న ఉత్తరప్రదేశ్ టీం విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌కు అడుగు పెట్టేందుకు మరొక అడుగు ముందుకు వేసింది. అయితే ఇప్పటివరకు జరిగిన స్కోరు వివరాలను బట్టి నేడు క్వార్టర్స్‌కు ఎవరు వెళ్తారు అనేది తెలనుంది.



ఆంధ్రప్రదేశ్- ఉత్తరప్రదేశ్ టీమ్ ల మధ్య మ్యాచ్

మృత్యువాత పడిన పందుల పరిశీలన

-ప్రజాశక్తి వార్తకు స్పందించిన వెటర్నరీ డాక్టర్ సుప్రియ

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామంలో పోలవరం కాలవలో సుమారు 20 పందులు మృత్యువాత పడి ఉండడంపై ప్రజాశక్తి పత్రికలో వచ్చిన కథనానికి వెటర్నరీ డాక్టర్ సుప్రియ స్పందించారు. సోమవారం ఉదయం ఆ గ్రామానికి వెళ్లి పరిశీలించి గ్రామంలో పందులు ఎవరీ అనే వాటిపై ఆరా తీశారు. అయితే ఆ గ్రామస్తులు కొంతమంది పందులు పొలాల్లో చేరి పంట నష్టం చేస్తున్నాయని అందువల్ల అక్కడున్న రైతులు మందు పెట్టడం వల్ల చనిపోయి ఉండవచ్చని వాటిని తీసుకొచ్చి అక్కడ పడేసి ఉంటారని కొంతమంది ఆరోపిస్తున్నారని ఆమె తెలిపారు. పూర్తిస్థాయిలో అవి ఎవరివి దానిపై ఆరా తీస్తున్నామన్నారు. వైరస్ వచ్చి చనిపోయిన పందులను పందులు పెంపకం దారులు పాడేసి ఉండవచ్చని మరికొందరు చెబుతున్నారని తెలిపారు. దీనిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు దీనిపై సంబంధిత అధికారులు ఉన్నత అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆదిత్యలో ప్రాజెక్టు ఎక్స్‌పో

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ఒక రోజు ప్రాజెక్ట్ ఎక్స్‌పో ఈవెంట్‌ను నిర్వహించినట్లు విభాగాధిపతి డాక్టర్ ఎన్. రామ్మోహన్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు 40 బందాలుగా పోస్టర్లు, నమూనాతో తమ వినూత్న ఆలోచనలు అద్దంపట్టే విధంగా ప్రద ర్శించిన ప్రాజెక్ట్ ఎక్స్‌ఫో ఆద్యంతం విజ్ఞానదాయకంగా సాగింది. కళాశాల సివిల్ విభాగాధిపతి ప్రొఫసర్ నాగసాయి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యా ర్థుల నూతన ఆవిష్కరణలలో అత్యుత్తమ ప్రాజెక్ట్‌లను ఎంపిక చేశారు కార్య క్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి, వివిధ విభాగాల డీన్‌లు, హెచ్‌ఓడీలు, సివిల్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేట్లపాలెంలో అన్నదానం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం వేట్లపాలెం-పెద్దాడ రోడ్డులో వేంచేసియున్న శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ కమిటీ నాయకులు, గ్రామస్తులు, దాతల సహకారంతో సుమారు 15వేల మందికి మంగళవారం భారీ అన్నదానం నిర్వహించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పెద్దాపురం నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు మహా అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి రామ్ ప్రసాద్, మాజీ ఉప సర్పంచ్‌లు గోలి వెంకట్రావు, వల్లూరి శ్రీనివాసు, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మోరంపూడి రంగా పాల్గొన్నారు.

వైసిపి హయాంలో ప్రతి కుటుంబానికీ మేలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మేలు చేశారని ముమ్మిడివరం ఎంఎల్‌ఎ పొన్నాడ సతీష్ కుమార్ అన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా గృహ సారథులతో తాళ్లరేవులో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. మార్చి 18 నుంచి 25వ తేదీ లోపు జగనన్న చేసిన అభివృద్ధిపై ప్రతి గృహ సారథి 50 నుంచి 55 ఇళ్లప్రచారం చేయాల న్నారు. దీనికి అవసరమైన స్టిక్కర్లు, సామాగ్రి త్వరలో అందజేస్తామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ.1200 కోట్లతో 92 శాతం మంది లబ్ధిదారులకు మేలు చేకూర్చా మన్నారు. ప్రతి పథకం మహిళలకే ఇస్తున్నందున ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేయడంలో మహిళా గృహ సారథులు ముఖ్యపాత్ర వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, వైస్ ఎంపీపీలు ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కొపనాతి లలిత, స్థానిక సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసిని దేవి, ఎంపీటీసీలు చిట్టూరి లలిత పద్మ, నంది కోళ్ల శ్రీదేవి, రచ్చ ముత్యాలు, జడ్‌పి మాజీ చైర్మన్ దున్న జనార్ధన రావు, మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైల్వే ఆస్తుల జోలికి వస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం జి.మేడపాడు గ్రామం సచివాలయం వద్ద సోమవారం రైల్వే రక్షణ దళం ఎస్ఐ పి.రామకృష్ణ, ఎఎస్ఐ వరప్రసాద్‌లు రైల్వే చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నడుస్తున్న రైళ్ళపై రాళ్లు రువ్వడం, రైల్వే ఆస్తులు, ప్రాంతాల వద్ద మద్యం సేవించి అమానుషంగా ప్రవర్తించడం సరికాదని, అటువంటి చర్యలకు రైల్వే చట్టాల్లో కఠిన మైన శిక్షలు ఉంటాయన్నారు. పలు అంశాలపై గ్రామస్తులకు వారు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జి.మేడపాడు గ్రామ సర్పంచి పటాని దేవి, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, సీనియర్ వైసిపి నాయకుడు మోరంపూడి రంగా, గ్రామ కార్యదర్శి రామకృష్ణ, ప్రజలు, రైల్వే స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామస్తుల డిమాండ్లు నెరవేరుస్తాం

ప్రజాశక్తి -రౌతులపూడి:

గ్రామస్తుల డిమాండ్‌లను నెరవేరుస్తామని క్వారీ క్రషర్ యజమానులు, ప్రతినిధులు హామీ ఇచ్చారు. రౌతులపూడి మండలంలోని మల్లంపేట గ్రామంలో సోమవారం ఆ గ్రామ సమీపంలో ఉన్న స్టోన్ క్రషర్ యజమా నులు, క్వారీ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో గ్రామస్తులు పలు డిమాండ్లను తెలియజేశారు. రోజు మూడు విడతలగా రోడ్డు వెంబడి వాటరింగ్ చేయాలని. ప్రతి లారీ బాడీ కంటే ఎక్కువ లోడు వేయకూడదని. గ్రామంలో ఉన్న నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం, 50 అడుగులలోతు కంటే ఎక్కువ రిగ్గింగ్ చేయకూడదని, 2000 అడుగులు కంటే ఎక్కువ బ్లాస్టింగ్ చేయకుండా చూడాలని అంటూ పలు డిమాండ్లను క్వారీ ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. తమ డిమాండ్లు ను పరిష్కరించకపోతే గ్రామం మీదగా వాహనాలను తిరగనీయమని గ్రామస్తులు హెచ్చరించారు నెల రోజులలో గ్రామస్తుల డిమాండ్లను నెరవేరుస్తామని క్వారీ క్రషర్ ప్రతినిధులు గ్రామస్తులకు హామీ ఇచ్చారు. సమావేశంలో జడ్‌పిటిసి గొల్లు లక్ష్మణమూర్తి. వైసిపి మండల అధ్యక్షుడు శ్రీను, గ్రామ నాయకులు పోలుపర్తి తాతాజీ, శ్రీరాంరెడ్డి శ్రీను. శ్రీరాంరెడ్డి బుల్లబ్బాయి తదితరులు ఉన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ఉంద్రాజవరం

వ్యాపార అవసరాలకు రుణాలు పొందిన మహిళలు ఆ సొమ్మును జీవనోపాధి నిమిత్తం వెచ్చించి కుటుంబ ఆదాయం పెంపొందించు కోవాలని జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కాలాబత్తుల సుజాత అన్నారు. సోమవారం ఆమె మహిళ సమాఖ్యకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మహిళ మండలి సమాఖ్య పనితీరు గురించి సిబ్బందిని అడిగి తెలుసు కున్నారు. గ్రామ సంఘ సహాయకులను కలిసి, వివిధ రంగాల్లో మహిళల ఎదుగుదలను ప్రోత్సహిం చాలని సూచిం చారు. ఈ సమావేశంలో అధ్యక్షురాలు పి.లక్ష్మి, సెక్రటరీ పద్మావతి, కోశాధికారి యు.సుబ్బలక్ష్మి, ఎపిఎం రత్నకుమార్, సిసిలు శేషారత్నం, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కెవిఎస్ కళాశాలలో టిబి పక్షోత్సవాలు

ప్రజాశక్తి- గోకవరం

గోకవరం కెవిఎస్ డిగ్రీ కళాశాలలో టిబి పక్షోత్సవాల్లో భాగంగా ఎంపిహెచ్ఇఒ వైయస్ రాయుడు ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ పివి.ప్రసాద్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ప్రజల్లో వ్యాప్తి చెందుతున్న కొన్ని రోగాలు ఏ విధంగా గుర్తించాలో వివరించారు. నిమోనియా సంబంధమైన వ్యాధులు టిబిలోకి దించకుండా ఏ విధంగా గుర్తించాలనే అంశంపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం కోసం వైద్య ఆరోగ్య శాఖ ఇటువంటి కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. టిబి లక్షణాలు, పరీక్షలు, ప్రభుత్వాసుపత్రిలో అందించే సేవలు, చికిత్స వివరాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శ్రీనివాస్, అధ్యాపకులు బాబూరావు, అబ్బులు, రాంబాబు, ఆరోగ్య సిబ్బంది పవన్, రమణ విద్యార్థులు పాల్గొన్నారు.

తలసేమియా బాధితురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

తలసేమియా వ్యాధితో బాధ పడుతున్న స్థానిక శాటిలైట్ సిటీకి చెందిన ఆటో డ్రైవర్ రాజేష్ దంపతుల కుమార్తె సిహెచ్.మాధురికి వైద్య చికిత్స నిమిత్తం రూ.15 లక్షలు అందజేసినట్టు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ మాధవీలతను మాధురి తల్లితండ్రులు సిహెచ్.రాజేష్, చందన భాను కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ చిన్నారి వైద్య ఖర్చుల కోసం ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షలు, సిఎంఆర్ఎఫ్ కింద రూ.5 లక్ష తో పాటు వైద్య చికిత్స అనంతరం మరో రెండు లక్షలు అందిస్తామన్నా. ప్రతినెలా రూ.10 వేలను పెన్షన్‌గా అందిస్తున్నట్టు చెప్పారు.